క్లుప్తంగా

ప్రశ్నతోనే సమాజ గమనం



శిక్షణ ఇస్తున్న దాదాపీర్

పోరుమామిళ్ల: ప్రశ్న తోనే సమాజ పురోగమనం సాధ్యమవుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గసభ్యులు దాదాపీర్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఆఫ్రిది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి శుక్రవారం దాదాపీర్ హాజరై విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన కల్పించారు. విద్యార్థులు సమాజ గతిని తెలుసుకోవడం వలన భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకుంటారని పేర్కొన్నారు. గ్రంథాలయంలో పుస్తక పఠనం అన్ని విధాల మేలు చేకూర్చుతుందన్నారు. శాస్త్రీయ విజ్ఞానంపై విద్యార్థులకు తర్ఫీదు ఇస్తామన్నారు. విద్యార్థులకు మంచి చేతిరాత అలవర్చుకునేలా శిక్షణ ఇస్తామన్నారు. వేసవి శిబిరానికి అధిక సంఖ్యలో విద్యార్థులు రావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

చాపాడు: మైదుకూరు - ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని పల్లవోలు సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో దువ్వూరు మండలంలోని ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మొగిలి హరిబాబు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని పల్లవోలు గ్రామానికి చెందిన హరిబాబు విధుల నిమిత్తం ప్రొద్దుటూరు మీదుగా దువ్వూరు వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో పల్లవోలు నుంచి బైక్‌లో వెళుతుండగా గ్రామ సమీపంలోని అలవంక దగ్గర ముందు వెళుతున్న ఏపీ16డీపీ 6704 నంబరు కారు అదుపు తప్పింది. దీని వెనకాలే వెళుతున్న హరిబాబు బైక్ ప్రమాదవశాత్తు కారును ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరిబాబు ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై బాధితుడు హరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మాజీ ఉపమండలాధ్యక్షుడు మృతి

ఖాజీపేట : ఖాజీపేట మాజీ ఉపమండలాధ్యక్షుడు కొత్తపల్లె షరీఫ్ మృతి చెందారు. అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లో రెండు నెలలుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఖాజీపేట మండలంలో 1995 నుంచి 2000 వరకూ మండల ఉపాధ్యక్షునిగా పనిచేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ తన పదవీకాలంలో తన వంతుగా ప్రజాసేవ చేస్తూ ప్రశంసలు పొందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వారి కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి తోపాటు ఆయన సతీమణి మాజీ మండలాధ్యక్షురాలు డీఎల్ సుభద్రమ్మ షరీఫ్ ఇంటికి వెళ్లి నివాళి అర్పించారు. మండలంలోని నాయకులు వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు నివాళి అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

వైభవంగా వేణుగోపాల స్వామి రథోత్సవం



గోపవరంలో వేణుగోపాలస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గోపవరం : మండలంలోని గోపవరంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పిల్లలు, పెద్దలు రథాన్ని ముందుకు లాగుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

పెంటగాన్ స్పేస్ సంస్థకు విద్యార్థుల ఎంపిక

ప్రొద్దుటూరు : స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థులు బెంగళూరుకు చెందిన పెంటగాన్‌స్పేస్ సంస్థ గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న 17 విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ సీనియర్ క్యాంపస్ హైరింగ్ మేనేజర్ కాజల్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.3.6 లక్షల ప్యాకేజీని అందిస్తామని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ జి.హుస్సేన్‌రెడ్డి మాట్లాడుతూ జేఎన్‌టీయూఏ ఇటీవల ప్రకటించిన చివరి ఏడాది పరీక్షల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించి ఉద్యోగాలకు ఎంపికవడం పట్ల అభినందించారు. ప్రిన్సిపాల్‌తోపాటు ఉద్యోగ నియామక అధికారి పీఎం నసీర్‌హుస్సేన్, వివిధ విభాగాల అధిపతులు, ఏఓ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

విజయమార్గాలు సూచించే గీత



భగవద్గీత శిక్షణకు హాజరైన విద్యార్థులు



భగవద్గీతను బోధిస్తున్న శ్రీకృష్ణ చైతన్య స్వామి

భగవద్గీత నదీ ప్రవాహం. అందరికీ సమ్మతమైన జీవన విధానం. అందుకే గీత మత గ్రంథం కాదు, దివ్య జీవన ప్రబంధం అన్నారు వేదాంతులు. భగవద్గీత పఠనం వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేస్తుంది. విజయమార్గాలకు దిక్సూచి గీత. చిన్నప్పటి నుంచే భగవద్గీత పఠనం.. శ్లోకాలు కంఠస్థం చేయడం వలన జ్ఞాపక శక్తి, ధైర్యం, అభయం, దైవ భక్తి, తల్లిదండ్రుల పట్ల భక్తి, పెద్దల పట్ల భక్తి భావన కలగనుంది. ది ప్రొద్దుటూరు ఆర్యవైశ్య యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నెల రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు సంకల్పించారు.

- చిన్నారుల మానసిక వికాసం కోసం భగవద్గీత శిక్షణ
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- ది ప్రొద్దుటూరు ఆర్యవైశ్య యువజన సమాఖ్య ఆధ్వర్యంలో శిక్షణ

ప్రొద్దుటూరు : మొబైల్ ప్రభావం కారణంగా వేసవి సెలవుల్లో విద్యార్థులు పక్కదారి పట్టే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నారుల మానసిక వికాసాన్ని పెంపొందించాలనే గొప్ప ఆశయంతో ప్రొద్దుటూరు పట్టణంలోని అరబిందో ఇంటిగ్రల్ స్కూల్‌లో భగవద్గీత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ది ప్రొద్దుటూరు ఆర్యవైశ్య యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి నెల రోజుల పాటు ఈ తరగతులను నిర్వహిస్తున్నారు. పాఠశాలల స్థాయిలో చదివే ఆసక్తి గల విద్యార్థులను ఎంపిక చేసి రోజు ఉదయం 2 గంటల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోంది. స్వారాజ్య గీతా ప్రచారకులు బ్రహ్మశ్రీ శ్రీకృష్ణ చైతన్య స్వామి భగవద్గీతపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఉచితంగా తరగతులను నిర్వహించడంతో పాటు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ప్రత్యేకించి శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతి రూ.2,500 విజేతలకు ఇవ్వనున్నారు. 6 నుంచి 14 ఏళ్లలోపు విద్యార్థులను ఈ తరగతులకు ఎంపిక చేశారు.

భగవద్గీత ద్వారా ఎన్నో ఉపయోగాలు

చిన్నప్పుడే భగవద్గీత శ్లోకాలు నేర్పించడం ద్వారా విద్యార్థులకు ఎన్నో రకాల ప్రయోజనాలు చేకూరనున్నాయి. శ్లోకాలను పఠించడం ద్వారా జ్ఞాపక శక్తి, ధైర్యం, అభయం, దైవ భక్తి, తల్లిదండ్రుల పట్ల భక్తి, పెద్దల పట్ల భక్తి భావన కలగనుంది.

గాంధీజీ చేతిలో నిత్యం భగవద్గీత ఉండేది



జాతిపిత మహాత్మా గాంధీజీ చేతిలో నిత్యం భగవద్గీత ఉండేది. భగవద్గీత ప్రభావం కారణంగానే ఆయన ఉన్నత స్థితికి చేరారని చెప్పవచ్చు. విద్యార్థులకు చిన్నప్పుడే భగవద్గీత నేర్పడం ద్వారా వారు జీవితంలో రాణించే అవకాశం ఉంది. ఒక్కో ఏడాది ఒక్కో అధ్యాయాన్ని నేర్పాలని నిర్ణయించాం. మొత్తం 18 అధ్యాయాలు నేర్చుకుంటే చాలా ఉపయోగకరం. భగవద్గీతలో జీవిత సారాంశమంతా ఉంది. – స్వారాజ్య గీతా ప్రచారకులు బ్రహ్మశ్రీ శ్రీకృష్ణ చైతన్య స్వామి

చిన్నారుల్లో ఆసక్తిని పెంపొందించేందుకే తరగతులు



వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ఉండేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. భగవద్గీత నేర్చుకోవడం ద్వారా ప్రతి మనిషి జీవితం పరిపూర్ణత చెందుతుంది. చిన్నప్పుడే నేర్చుకుంటే జీవితాంతం శ్లోకాలు గుర్తుంటాయి. గొప్ప ఆశయంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. –గాజులపల్లి అభినయ్, ది ప్రొద్దుటూరు ఆర్యవైశ్య యువజనసమాఖ్య అధ్యక్షుడు, ప్రొద్దుటూరు.

ఘనంగా అన్నమయ్య జయంతి



అన్నమయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో శుక్రవారం పదకవితా పితామహుడు అన్నమాచార్య 616వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య చిత్రపటానికి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు చిప్పగిరి ప్రసాద్, టంగుటూరు మారుతిప్రసాద్, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, అగస్త్యేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పూలమాల వేసి టెంకాయ కొట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య 32 వేల సంకీర్తనలను రచించారని, అందులో ప్రస్తుతం 12 వేలు మాత్రమే మనకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ, వేటూరి ప్రభాకర శాస్త్రి తదితరుల కృషి వలన అన్నమయ్య పద సాహిత్యం వెలుగులోకి వచ్చిందన్నారు. తెలుగు నుడికారం, స్వచ్ఛమైన భావ సంపద అన్నమయ్య పదాల్లో అడుగడుగునా కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగవతార్ యడవల్లి రమణయ్య, రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, కోశాధికారి గంగాధర్, ఉపాధ్యక్షులు సాయికుమార్, మధు, విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు ఓబుళరెడ్డి, ఉపాధ్యాయుడు సుధాకర్ పాల్గొన్నారు.

కేవైసీ చేయించుకోవాలి

వల్లూరు : వల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాలు పొందిన వారితోపాటు, సభ్యత్వం కలిగిన ప్రతి సభ్యుడు కేవైసీ చేయించుకోవాలని పీఏసీఎస్ సీఈవో రామచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని సహకార సంఘాలన్నీ కంప్యూటరీకరణ జరుగుతున్న నేపథ్యంలో ప్రతి సభ్యుడు కేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు. త్వరలో సహకార సంఘాల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేవైసీ చేయించుకోకపోతే సభ్యత్వం కోల్పోతారని తెలిపారు. వాటితోపాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు అందకుండా పోయే అవకాశం వుందని తెలిపారు. కావున ప్రతి సభ్యుడు తమ ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబరును వల్లూరులోని పీఏసీఎస్ కార్యాలయంలో అందచేసి కైవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని తెలిపారు.

సైన్స్‌తో మూఢ నమ్మకాలు దూరం



చేతిలో కర్పూరాన్ని వెలిగించి చూపుతున్న సమీర్‌బాషా

కడప కల్చరల్ : సైన్స్ ద్వారా మూఢ నమ్మకాలు, మూఢాచారాలు దూరమవుతాయని జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి సమీర్‌బాషా తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో కడప నగర విద్యార్థులకు స్థానిక ఆర్కే నగర్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రుజువు చేయలేని అంశాలను, వాస్తవాలను ఇతరులకు వివరించి ప్రజా చైతన్యం తెచ్చేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు లో కాస్ట్...నో కాస్ట్ అంశంపై సైన్స్ ప్రయోగాలను చేసి చూపించారు. మరికొన్ని విద్యార్థులతో చేయించారు. జేవీవీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సైన్స్ అంటే తెలియని విషయాలను తెలుసుకోవడమేనని, క్రమబద్ధమైన జ్ఞానమని, కేవలం నమ్మకాలు, ఊహలతో విషయ జ్ఞానం సంపాదించడం కాదని తెలిపారు. మెజీషియన్ సమీర్ బాషా చేతిలో కర్పూరాన్ని వెలిగించడం, నోటిలో నుంచి శివలింగాన్ని తీయడం లాంటి ఆసక్తికరమైన ఇంద్రజాల అంశాలను ప్రదర్శించారు.

రిమాండ్ ఖైదీలను పరామర్శించిన రెడ్యం

చాపాడు: చాపాడు, ఖాజీపేట మండలాల్లో ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికలలో జరిగిన ఘర్షణ కేసుల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారిని శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కమలాపురం సబ్ జైలులో పరామర్శించారు. చాపాడు మండల పరిధిలోని చిన్నగురువళూరు, ఖాజీపేట మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీ రహమత్ ఖాన్ పల్లె పోలింగ్ కేంద్రాల వద్ద ఈ నెల 13న ఘర్షణలు జరిగాయి. ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న చిన్నగురువళూరు, రహమత్‌ఖాన్‌పల్లె గ్రామాలకు చెందిన వ్యక్తులు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. పరామర్శించిన అనంతరం రెడ్యం మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

ఊపందుకున్న ఉపాధి

రోజు 2,000 మందికి పని, రూ. 300 కూలీ



కదిరివారిపల్లో ఉపాధి కూలీలు

ఎర్రగుంట్ల : మండల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ఊపందుకున్నాయి. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకూ వ్యవసాయ పనులకు విరామం ఉండటంతో ప్రస్తుతం ఉపాధి పనులు గ్రామీణ కూలీలకు కల్పతరువుగా మారాయి. సకాలంలో వేతనాలు అందుతుండటంతో పనుల్లో పాల్గొనే వారి సంఖ్య రెట్టింపు అయింది. దీంతో ఉపాధి పనుల కల్పనలో ఎర్రగుంట్ల మండలం ప్రథమ స్థానంలో ఉంది. మండల పరిధిలోని ఇల్లూరు, చిన్నదండ్లూరు, పోట్లదుర్తి, నిడుజివి, కదిరివారిపల్లె, వలసపల్లె తదితర గ్రామాలలో డీఓపీ పనులు, పంట కాలువలు, చెక్ డ్యామ్‌లలో పూడిక తీత పనులు జరుగుతున్నాయి. మండల పరిధిలో సుమారు 3500 మందికి జాబ్ కార్డులు ఉండగా, ఇందులో 2000 మంది దాకా ఉపాధి కూలీలు పనులకు పోతున్నారు. ఉపాధి హామీ పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు ఎర్రగుంట్ల మండల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ గంగాభవాని తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



అట్లూరు: కుంభగిరిలో ప్రజలతో మట్లాడుతున్న బద్వేలు రూరల్ సీఐ, అట్లూరు, బద్వేలు రూరల్ ఎస్ఐలు



బి.కోడూరు : సమావేశంలో మాట్లాడుతున్న బద్వేలు రూరల్ సీఐ విక్రమ సింహ, ఎస్ఐ జయరాములు

అట్లూరు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యల తప్పవని బద్వేలు రూరల్ సీఐ విక్రమ సింహా, స్థానిక ఎస్ఐ కేసీ.రాజు, బద్వేలు రూరల్ ఎస్ఐ రవికుమార్ హెచ్చరించారు. మండల పరిదిలోని కుంభగిరి గ్రామంతో పాటు ఎస్ వెంకటాపురం కాలనీలలో శుక్రవారం నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో వీధుల్లో కలియ తిరిగి, వరిగడ్డి వాముల్లో అనుమానితుల ఇళ్లలో క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. ఆయా గ్రామాలలోని ప్రజలతో వారు మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉటుందని, ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని బాణా సంచా పేల్చడం, అల్లర్లుకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బద్వేలు రూరల్, అట్లూరు పోలీసులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

బి.కోడూరు : ఎన్నికల ఫలితాలలో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని బద్వేలు రూరల్ సీఐ విక్రమసింహా, ఎస్ఐ జయరాములు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రమైన బి.కోడూరు పోలీసుస్టేషన్ ఆవరణలో మండలంలోని వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నియమాలు పాటిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. విజయోత్సవ ర్యాలీలు, టపాసులు పేల్చరాదని, రెచ్చగొట్టే మాటలు మాట్లాడినా, ఘర్షణలు సృష్టిస్తే రౌడీషీట్ ఓపెన్ చేసి జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బి.కోడూరు పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, బి. కోడూరు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. నృసింహుడి కల్యాణం



గ్రామంలో చాందినీ బండ్లు ఊరేగిస్తున్న దృశ్యం

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు విచ్చేసి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవంలో పాల్గొని తిలకించారు. వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పించారు. కల్యాణం అనంతరం భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామంలోని పురవీధుల్లో చాందినీ బండ్లు ఊరేగింపు, స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. పలువురు ప్రముఖులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో కనకదుర్గమ్మ

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో వైశాఖమాసం మూడవ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే కనకదుర్గమ్మ అమ్మవారికి మామిడికాయలతో నిర్వహించిన అలంకారం భక్తులను ఆకట్టుకుంది. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే దుర్గమాత గుడి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు సుబ్బరాజు, నాగభూషణం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టండి

ఎంపీపీ బోదనబోయిన నిర్మలాదేవి



మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మలాదేవి

కలసపాడు : వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ బోదనబోయిన నిర్మలాదేవి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికి పని కల్పించాలన్నారు. వేసవిలో కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా అధికారులు చేపట్టబోయే పనులపై నివేదికలను వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ, కోటీశ్వర్‌రావు, తహసీల్దారు కృష్ణకుమార్, ఎంఈఓ మస్తాన్‌వలి, జెడ్పీటీసీ గురివిరెడ్డి, సర్పంచ్ సూదా రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు వావిళ్లమల్లిక, కో ఆప్షన్ మెంబర్ మహబూబ్‌బాషా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ షాపులో విజిలెన్స్ అధికారుల తనిఖీ



షరబత్ బాటిళ్లను పరిశీలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని మైదుకూరు రోడ్డులోని నజ్మా కూల్‌డ్రింక్ షాపులో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. షాపులో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు తక్కువ నాణ్యత కలిగిన ప్లాస్టిక్ బాటిళ్లు, పాలిథిన్ కవర్లు వాడుతున్నారనే కారణంతో రూ. 5 వేలు జరిమానా విధించారు. అలాగే ఫుడ్ లైసెన్స్ లేనందున సంబంధిత అధికారులు నోటీసు జారీ చేశారు. నన్నారి షరబత్ బాటిళ్ల ప్యాకింగ్ చేయడానికి లైసెన్స్ లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు రూ. 20 వేలు జరిమానా విధించారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు జీ ఈదురుబాష, బి బాబుమోజెస్, బాలగంగాధర్‌రెడ్డి, ఎం హరిత, జయదేవ్, వీవీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నరసింహస్వామి అలంకారంలో చెన్నకేశవుడు



నరసింహస్వామి అలంకారంలో చెన్నకేశవుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున చెన్నకేశవస్వామి, మహాలక్ష్మీదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం స్వామివారిని నరసింహస్వామిగా అలంకరించారు. అనంతరం పురవీధుల్లో గోవింద నామ స్మరణల మధ్య ఘనంగా ఊరేగించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజించారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉపాధి అవకాశాలు

కమలాపురం : పాలిటెక్నిక్ విద్యతో ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని కమలాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ కళాశాలలో జాబ్ అచీవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్న 12 మందికి కొప్పర్తిలోని డిక్సన్ పరిశ్రమలో ఉపాధి లభించింది. వారికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీడీఓ జ్యోతి, నగర కమిషనర్ రాముడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ కోర్సు చేయడంతో చిన్న వయసులోనే ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే బి.టెక్‌లో డైరెక్ట్‌గా సెకండియర్ చదవవచ్చన్నారు. తమ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్ కోర్సులు ఉన్నాయన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు తమ కళాశాలలో ఏ కోర్సులోనైనా నేరుగా చేరవచ్చన్నారు. ఎంపీడీఓ, కమిషనర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సులకు మంచి ఆదరణ ఉందన్నారు. ముఖ్యంగా చిన్న వయసులోనే ఉపాధి అవకాశాలు పొందడంతోపాటు ఉన్నత విద్య కూడా అభ్యసించవచ్చన్నారు. పాలిటెక్నిక్ విద్య చదువుతుండగానే ఈ కళాశాలకు చెందిన 12 మందికి ఉపాధి లభించడం హర్షణీయం అన్నారు. అలాగే మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహించే అవకాశం ఉందని, అందులో విద్యార్థులందరికీ ఉపాధి అవకాశం వస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ హుండీ సొమ్ము లెక్కింపు

కడప కల్చరల్ : మృత్యుంజయకుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వర స్వామి ఆలయ హుండీ సొమ్మును శుక్రవారం లెక్కించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్దన్ పర్యవేక్షణలో ఆలయ ఈఓ, కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ అధికారి ఎ.శ్రీధర్ పాల్గొన్నారు.